# అణ్వాయుధాల తగ్గింపు.. అమెరికా కొత్త ఒరవడి

**ప్రపంచాన్ని అణ్వస్త్ర రహిత మండలంగా మార్చాలని అమెరికా అధ్యక్షుడు ఒబామా కృత నిశ్చయంతో ఉన్నారు. ఈ దిశగా ఆయన ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందుకు ప్రతిగా రష్యా కూడా సానుకూలంగా స్పందిస్తోంది. ఈ ఒరవడి క్రమాన్ని గమనిద్దాం...**

- ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో ఆయుధ పోటీని తగ్గించి వ్యూహాత్మక స్థిరత్వాన్ని సిద్ధింపచేయడానికి ప్రారంభమైన వ్యూహాత్మక అణ్వాయుధ పరిమితి చర్చలు (సాల్ట్) వ్యూహా త్మక ఆయుధ పరిమితి ఒప్పందం (స్టార్ట్)తో ముగిశాయి.
- ఈ సమయంలో అమెరికా, అప్పటి సోవియట్ యూనియన్‌ల మధ్య అనేక శిఖరాగ్ర చర్చలు జరిగాయి. ఈ సమావేశాల్లో ఆయుధ నిపుణులు వివిధ ఒప్పందాలను, పరిశీలన నిబంధనలను చర్చకు తెచ్చారు. సమగ్ర అణ్వాస్త్ర పరీక్ష రద్దు ఒప్పందాన్ని (సీటీబీటీ) అమెరికా సెనేట్ తిరస్కరించింది.
- యాంటీ బాలిస్టిక్ మిసైల్ ట్రీటీ (బాలిస్టిక్ క్షిపణుల వ్యతిరేక ఒప్పందం) నుంచి అమెరికా వైదొలగింది.
- అణ్వాస్త్ర వ్యాప్తిని నిరోధించి అంతిమంగా అసలు అణ్వాస్త్రాలే లేకుండా చేయాలన్న లక్ష్యంతోకూడిన ఆణ్వాయుధ వ్యాప్తి నిరోధక ఒప్పందం అమల్లో పూర్తిగా విఫలమయ్యింది.

### 2002-ఏబీఎం నుంచి వైదొలగిన అమెరికా:

- యాంటీ బాలిస్టిక్ మిసైల్ (ఏబీఎం) ఒప్పందం నుంచి అమెరికా 2002 జూన్, 13న లాంఛనంగా వైదొలిగింది.
- అణ్వస్త్ర క్షిపణుల నుంచి రక్షించుకోవటానికి అవసరమైన రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు ఇరుదేశాలు దూరంగా ఉండాలని ఉద్దేశించిన ఏబీఎం ఒప్పందంపై అమెరికా, రష్యాలు 1972లో సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో అణ్వాయుధాల నిర్మూలనకు ఒకరికొకరు హామీగా ఉండే నియమానికి కట్టుబడేట్టు చేసి వ్యూహాత్మక స్థిరత్వానికి దారిచూపింది.
- 1990ల్లో అమెరికా 'జాతీయ క్షిపణి రక్షణ వ్యవస్థ' (ఎంఏడీ)కు శ్రీకారం చుట్టడంతో ఏబీఎం ఒప్పందానికి విఘాతం కలిగింది. అప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా అణ్వస్త్రాల నుంచి అభయమిచ్చి రక్షణ స్థిరత్వాన్ని కలిగించిన ఒప్పందంగా ఏబీఎం నిలిచింది.

### రష్యా ప్రతిచర్య:

- తాము 1993లో సంతకం చేసిన అణ్వస్త్ర పరిమితి చట్టం-2 (స్టార్ట్-2)లోని నిబంధనలకు ఇక ఏమాత్రం కట్టుబడి ఉండబోమని రష్యా 2002, జూన్14న ప్రకటించింది.
- జాతీయ క్షిపణి రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు అమెరికా స్థిర నిర్ణయం తీసుకున్నందున స్టార్ట్ నిబంధనకు

వ్యతిరేకంగా భూమి నుంచి ప్రయోగించే బహుళ వార్‌హెడ్‌లు కలిగిన క్షిపణులను సిద్ధం చేసుకుంటామని రష్యా తమ ప్రకటన ద్వారా తెలియజేసినట్లయింది.

### వ్యూహాత్మక అణ్వస్త్ర పరిమితి ఒప్పందం (స్టార్ట్):

- 1970ల ప్రారంభంలో అమెరికా, రష్యాల మధ్య అనేక అణ్వాస్త్ర ఒప్పందాలు కుదిరాయి. ఒకరి నుంచి ఒకరికి ఎదురయ్యే ఆపదలను తగ్గించుకునేందుకు ఎడతెగని చర్చలు జరిగాయి. వీటి వల్ల ఇరు దేశాల అణుసంపత్తి ఏమిటనేది స్పష్టమైంది.
- 1991, జులైలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్, సోవియట్ అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచెవ్‌లు వ్యూహాత్మక అణ్వాయుధ పరిమితి ఒప్పందం-1 (స్టార్ట్-1)పై సంతకాలు చేశారు. దీనిప్రకారం ఇరు దేశాలు అణ్వాయుధాల సంఖ్యను 14,719 (అమెరికా వార్ హెడ్‌లు 8,556కు, సోవియట్ యూనియన్ వార్‌హెడ్‌లు 6,613)కు తగ్గించుకోవాలి. ఈ ఒప్పందం అమల్లోకి రాక ముందు 1990లో ఇరు దేశాలలో కలిపి మొత్తం అణు వార్‌హెడ్‌ల సంఖ్య 23,658 కావడం గమనార్హం. అయితే స్టార్-1 ఒప్పందం 2009, డిసెంబర్‌తో ముగుస్తుంది.
- తర్వాత 1993, జనవరి 3 అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్, సోవియట్ యూనియన్ అధ్యక్షుడు బోరిస్ ఎలిత్సిన్‌ల మధ్య స్టార్ట్-2 ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రష్యా తమ అణ్వాయుధ శక్తిలో అధిక భాగమైనభూమిపై నుంచి ప్రయోగించే బహుళ వార్‌హెడ్స్ కలిగిన క్షిపణుల మోహరింపును నిలుపు చేయాలి. అయితే రష్యా ఈ ఒప్పందాన్ని 2000లో ఆమోదించినపుడు 1972లో అమెరికా ఆమోదించిన యాంటీ బాలిస్టిక్ మిసైల్ ఒప్పందాన్ని (జాతీయ క్షిపణి రక్షణ వ్యవస్థను రద్దు చేసుకోవడం) అమల్లోకి తేవాలని మెలిక పెట్టింది. దాంతో స్టార్ట్-2 ఒప్పందం అమల్లోకి రాలేదు.

### చర్చల పునరుద్ధరణకు అమెరికా, రష్యాలు సిద్ధం

- తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను పరిమితం చేసుకునే అంశంపై తిరిగి చర్చలు ప్రారంభించేందుకు అమెరికా అధ్య క్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వదెవ్‌ల మధ్య 2009, ఏప్రిల్ 1న లండన్‌లో జరిగిన సమావేశంలో అంగీకారం కుదిరింది. జీ-20 సదస్సులో భాగంగా ఇరు దేశాధ్యక్షులు సమావేశమయ్యారు.
- సుమారు దశాబ్దం తర్వాత అణ్వాయుధాల నియంత్రణపై తిరిగి అగ్రదేశాల మధ్య చర్చలు జరగడం ఇదే మొదటిసారి. ఈ చర్చలు 1991 స్టార్ట్-1 ఒప్పందం (ఈ ఒప్పందం 2009 తో ముగుస్తుంది) స్థానే కొత్త ఒప్పందం అమల్లోకి రావడానికి దోహదపడే అవకాశం ఉంది. ముందుగా తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను తగ్గించుకోవడం ద్వారా మాత్రమే ప్రపంచంలో అణ్వాయుధ వ్యాప్తి నిరోధక వ్యవస్థను పటిష్టపరచేందుకు నిజమైన మార్గదర్శకులుగా తాము నిలవగలమని ఇరు దేశాల అధ్యక్షులు ఈ సమావేశంలో అన్నారు.

- ఈ దిశగా తాము సాధించిన మొదటి ఫలితాలను రష్యాలో ఈ ఏడాది జులైలో జరిగే శిఖరాగ్ర సదస్సులో నివేదించాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. చర్చల వల్ల తమ అణ్వాయుధ నిల్వలు 80 శాతం తగ్గిపోయే అవకాశం ఉందని అమెరికా అధికారులు పేర్కొంటున్నారు.
- ఈ ఏడాది డిసెంబర్‌లో ముగిసే స్టార్ట్-1 ఒప్పందం స్థానంలో కొత్త ఒప్పందం అమలుకు మే 18న అమెరికా, రష్యాల మధ్య మొదటి దశ చర్చలు మొదలయ్యాయి.
- రష్యాతో బెడిసిన తమ సంబంధాలను తిరిగి గాడిన పెట్టడమే లక్ష్యంగా ఒబామా చేస్తున్న ప్రయత్నాలలో ఈ చర్చలు కీలకమైనవి. ఈ చర్చల ఫలితాలు ప్రపంచ భద్రతను ప్రభావితం చేస్తాయనడం సందేహం లేదు.

## అణ్వస్త్ర రహిత ప్రపంచం.. ఒబామా లక్ష్యం :

- ప్రపంచం నుంచి అణ్వాస్త్రాలను పూర్తిగా తుడిచిపెట్టాలన్నది తన లక్ష్యమని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు.
- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 24,000 అణ్వాయుధాలున్నట్టు అంచనా. ఇందులో ఒక వెయ్యి తప్ప మిగిలిన అణ్వాస్త్రాలన్నీ అమెరికా, రష్యాల వద్దే ఉన్నాయి. ఇదంతా ప్రచ్ఛన్న యుద్ధ ఫలితమేనని ఒబామా అన్నారు.
- ఇప్పటి వరకు ఎవరూ ప్రయత్నించని భారీస్థాయిలో అణు నిరాయుధీకరణ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామని ఒబామా ప్రతిజ్ఞ చేశారు.
- అణ్వాయుధ నిల్వలను మూడొంతులు తగ్గించడానికి ప్రస్తుతం రష్యా జరుపుతున్న చర్చలు కేవలం ప్రారంభం మాత్రమేనని, వీటిని మరింత తగ్గించేందుకు చర్చల వేగాన్ని పెంచుతామన్నారు.
- అమెరికా జాతీయ భద్రతా వ్యూహంలో అణ్వాయుధాల పాత్రను పరిమితం చేస్తానని ఒబామా స్పష్టం చేశారు. సమగ్ర అణుపరీక్షల రద్దు ఒప్పందం(సీటీబీటీ) సెనెట్ ఆమోదం నేపథ్యంలో ఈ దిశగా తాను గట్టి చర్యలు తీసుకుంటానని, తద్వారా సీటీబీటీ అమలుకు మార్గం సుగమం చేస్తానని అన్నారు.
- అణ్వాస్త్రాల తయారీకి ఉపయోగించే విచ్ఛిన్న పదార్థాల ఉత్పత్తిపై నిషేధాన్ని అమలు చేయడానికి అమెరికా ప్రభుత్వ యంత్రాంగం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన అన్నారు. అంతేకాక అణ్వాస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) అమలు చేయటానికి పటిష్ట చర్యలు తీసుకుంటానని ఒబామా స్పష్టం చేశారు.
- ఎన్‌పీటీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆయన రెండు చర్యలను సూచించారు. మొదటిది అణుబాంబులు తయారీ కి ఉపయోగించే విచ్ఛిన్న పదార్థాల ఉత్పత్తిని నిషేధించడం, విద్యుత్ ఉత్పత్తి వంటి తదితర శాంతియుత కార్యక్రమాలకు తక్కువ శుద్ధి చేసిన యురేనియంను అవసరమైన దేశాలకు సరఫరా చేసేందుకు ఒక అంతర్జాతీయ ఫ్యూయల్ బ్యాంకును నెలకొల్పడం రెండోది.
- ఒప్పందాన్ని ఉల్లంఘించే దేశాలను ఎప్పటికప్పుడు కనుగొని వెంటనే తగిన చర్యలను తీసుకోగలిగే

అధికారం కలిగిన ఒక గట్టి యంత్రాంగం అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

- ప్రపంచవ్యాప్తంగా సునాయాసంగా అందుబాటులో ఉన్న అణు పదార్థాలను భద్రమైన ప్రదేశాలకు చేర్చే కార్యక్రమాన్ని నాలుగేళ్లలోపే పూర్తి చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేయాల్సి ఉందన్నారు. అణుభద్రతపై సంవత్సరంలోపే అమెరికాలో తాను ఒక శిఖరాగ్ర సదస్సును నిర్వహిస్తానని ఒబామా తెలిపారు. అత్యంత శక్తివంతమైన అణ్వాయుధాలు టెర్రరిస్టుల చేతికందే పరిస్థితి ఇప్పుడుందని, ప్రపంచానికి పొంచి ఉన్న తక్షణ ప్రమాదం ఇదేనని ఒబామా హెచ్చరించారు.

## నిరాయుధీకరణపై ఒబామా చర్యలు.. ప్రాధాన్యం:

- విముఖంగా ఉన్న రష్యాను అణ్వాయుధాల తగ్గింపు అంశంపై తిరిగి చర్చలకు కూర్చోపెట్టగలగడం ఒబామా ప్రథమ విజయం. ఇది ప్రపంచ భద్రతపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. నిరాయుధీకరణను పెద్ద ఎత్తున అమలు చేయగల చట్ట, సాంకేతికపరమైన వ్యవస్థ స్టార్ట్-1 ఒప్పందం ద్వారా సమకూరింది. ఇది ప్రచ్ఛన్న యుద్ధంలో ఉన్న 60,000 అణ్వాయుధాలను 20,000కు తగ్గించగలిగింది.
- సమగ్ర అణుపరీక్షల రద్దు (సీటీబీటీ) ఒప్పందానికి అమెరికా ఆమోదం తెలపడం ఒక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే కొత్త అణ్వాయుధాల డిజైన్, తయారీ కార్యక్రమాలకు అమెరికా నిజంగా స్వస్తి చెబితేనే ఈ చర్య అర్థవంతంగా ఉంటుందని వారు అంటున్నారు.
- ఫిసైల్ మెటీరియల్స్ కట్ ఆఫ్ ట్రీటీ (ఎఫ్ఎంసీటీ) విషయంలో గత అమెరికా ప్రభుత్వ విధానాన్ని ఒబామా పూర్తిగా మార్చేశారు. పేలుడు పదార్థాల ఉత్పత్తి నిలిపివేతకు వీలుగా ఒప్పందం ఉండాలని ఒబామా కోరారు. ఈ చర్య జెనీవాలో జరగబోయే ఎఫ్ఎంసీటీ చర్చలను మరింత ముందుకు తీసుకుపోగలవని ఆయన అభిప్రాయపడ్డారు.
- అణ్వాయుధాలు లేని ప్రపంచాన్ని తయారుచేయాలన్నది తమ లక్ష్యమని అమెరికా, రష్యాల అధ్యక్షులు ఉమ్మడిగా ప్రకటించడం ఎంతో సానుకూల పరిణామం. అయితే ఇది ఆచరణలో సాధ్యం కావాలంటే... ముందుగా అమెరికా, రష్యాల్లోని అణ్వాయుధాల సంఖ్య ఒక్కొక్క దేశంలో వెయ్యికంటే తగ్గాలి. అలాగే సీటీబీటీ, ఎఫ్ఎఫ్సీటీ ఇంకా ఇతర నిరాయుధీకరణ ఒప్పందాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి.

## భారత్‌పై ప్రభావం

- సీటీబీటీ ఒప్పందాన్ని అమెరికా ఆమోదిస్తే భారతదేశానికి ఈ ఒప్పందాన్ని ఆమోదించాలన్న ఒత్తిడి ఎదురవుతుంది. అణునిరాయుధీకరణ ప్రాధాన్యం దృష్ట్యా భారత్ నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. మన దేశం ఇప్పటి వరకూ సీటీబీటీపై సంతకం చేయలేదు. 1998 నుంచి అణ్వాస్త్ర పరీక్షలను నిర్వహించకుండా స్వయం నియంత్రణ (మారటోరియం)ను పాటిస్తోంది.

- ఎఫ్ఎంసీటీ విధానాన్ని ఒబామా పూర్తిగా మార్చేయడం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎఫ్ఎంసీటీ పై భారత్ వైఖరి

- ఫిసైల్ మెటీరియల్ కటాఫ్ ట్రీటీ (అణ్వాయుధ తయారీకి వాడే పేలుడు పదార్థాల తయారీకీ ఒక కటాఫ్‌ను నిర్ణయించే ఒప్పందం) అందరికీ ఆమోదమైన, వివక్షారహితమైన, అంతర్జాతీయ పరిశీలనకు వీలయ్యేదిగా ఉండాలి.
- 2005 జులైలో జరిగిన ఇండో-యూఎస్ సివిల్ న్యూక్లియార్ అగ్రిమెంట్‌లోని నిబంధన ప్రకారం భారతదేశం ఎఫ్ఎంసీటీ విషయంలో అమెరికాతో కలిసి చురుకుగా పనిచేయాల్సి ఉంది.